


నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ ఆలయ నిత్యాన్నదానం ట్రస్టుకు బుద్దాల వెంకటేశ్వరరావు, సత్యవాణి దంపతులు (తణుకు) బుధవారం రూ.1,05,651 విరాళంగా అందించారు.



డెల్టాకు 8 వేల క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.80 అడుగులకు చేరింది.

గరిష్టం/కనిష్టం
38.0°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	36.0	27.0
కాకినాడ	33.6	27.0
అమలాపురం	38.0	26.0

న్యూస్‌రీల్

రామచంద్రపురానికి మళ్లీ అమాత్య యోగం




రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం: రామచంద్రపురం నియోజకవర్గానికి మళ్లీ అమాత్య యోగం వరించింది. ఎవరూ ఊహించని విధంగా ఇక్కడ కొత్తగా గెలుపొందిన ఎమ్మెల్యేలు రాష్ట్ర మంత్రులుగా పదవులు చేపట్టడం విశేషం. 2004లో ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు అనూహ్యంగా దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేబినెట్‌లో 2005లో రాష్ట్ర మంత్రి పదవి వరించింది. అక్కడి నుంచి మంత్రిగా చంద్రబోస్ 2009 వరకూ కొనసాగారు. తిరిగి 2009లో ఎన్నికల అనంతరం కూడా డాక్టర్ వైఎస్సార్ కేబినెట్‌లో 2010 వరకూ కొనసాగారు. అనంతరం 2019 ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గం అడవిపాలేనికి చెందిన చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆయనకు 2020 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవి దక్కింది. అప్పటి నుంచి ప్రస్తుతం కొత్త ప్రభుత్వం వచ్చే వరకూ వేణు మంత్రిగా నాలుగేళ్లు కొనసాగారు. ఈ నియోజకవర్గం నుంచి మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన వారు రాష్ట్ర కేబినెట్‌లో మంత్రులుగా పదవులు దక్కుతున్నాయి. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో అమలాపురం పట్టణానికి చెందిన వాసంశెట్టి సుభాష్ కూడా ఎన్నికలకు కేవలం నెల రోజుల ముందు టీడీపీ టిక్కెట్ దక్కించుకుని అనూహ్యంగా గెలుపొందారు. 26,716 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎవరూ ఊహించని విధంగా సామాజిక సమీకరణాల్లో సుభాష్‌కు మంత్రి పదవి దక్కింది. దీంతో రామచంద్రపురం నియోజకవర్గం నుంచి నెగ్గే కొత్తవారికి మంత్రి పదవి దక్కుతుందనే సెంటిమెంట్ అంతటా చర్చనీయాంశం అవుతోంది.

చేదు అనుభవం

కొత్త ముఖాలకు చోటు...



పవన్ కల్యాణ్



కందుల దుర్గేష్



వాసంశెట్టి సుభాష్

పాతవారికి మొహం చాటు



యనమల



జ్యోతుల నెహ్రూ



గోరంట్ల



చినరాజప్ప

- బాబు మంత్రివర్గంలో సీనియర్లకు మొండిచేయి
- గోరంట్లకు మరో'సారీ'
- నెరవేరని 'జ్యోతుల' చిరకాల కోరిక
- యనమల లేని తొలి మంత్రిమండలి
- ఎస్సీలకు దక్కని స్థానం
- 'తూర్పు'న మూడూ కొత్త ముఖాలే
- డిప్యూటీ సీఎంగా పవన్
- మంత్రులుగా దుర్గేష్, సుభాష్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: చంద్రబాబు నాయకత్వంలో బుధవారం కొలువుదీరిన మంత్రివర్గంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మూడు బెర్త్‌లకే పరిమితమైంది. ఈ మూడు జిల్లాలకు కలిపి నాలుగు మంత్రి పదవులు దక్కుతాయని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎదురుచూశారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను వరించే ఉప ముఖ్యమంత్రి పదవి రాష్ట్ర కోటాగా పరిగణించి ఉమ్మడి తూర్పునకు మరో మూడు మంత్రి పదవులు ఖాయమనే ధీమాతో కూటమి నేతలున్నారు. తీరా ఉప ముఖ్యమంత్రి పదవితో కలిపి మంత్రి పదవులు మూడుకే పరిమితం కావడంతో టీడీపీ ఎమ్మెల్యేలకు ఆశాభంగమే ఎదురైంది. జిల్లాల పునర్విభజనతో ఏర్పడ్డ మూడు కొత్త జిల్లాలకు ఒక్కొక్కటి చొప్పున మూడు మంత్రి పదవులు మాత్రమే దక్కాయి. ఉమ్మడి తూర్పు నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలున్న జనసేనకు రెండు మంత్రి పదవులు దక్కితే, అత్యధికంగా 15 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికైన టీడీపీకి కేవలం ఒకే ఒక మంత్రి పదవి దక్కడంపై తెలుగు తమ్ముళ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇలా గెలిచి.. అలా నిలిచి..

అంతా అనుకున్నట్టే కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి ఎన్నికైన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి వాసంశెట్టి సుభాష్, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నుంచి కందుల దుర్గేష్‌కు కేబినెట్‌లో స్థానం లభించింది. మూడు జిల్లాల నుంచి ఈ ముగ్గురూ కూడా తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రి పదవులను దక్కించుకున్నారు. మంత్రులుగా మూడు కొత్త ముఖాలే. జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, కాపు సామాజిక వర్గానికి చెందిన కందుల దుర్గేష్‌కు పవన్ ఆశీస్సులు దండిగా ఉండటం కలిసి వచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురానికి చెందిన శెట్టిబలిజ సామాజిక వర్గీయుడు వాసంశెట్టి సుభాష్ తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యే కావడమే కాకుండా మంత్రి పదవి దక్కించుకున్నారు. ఈ సామాజిక వర్గం నుంచి ఉమ్మడి తూర్పులో ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే కావడం, లోకేష్ ఆశీస్సులు ఉండడంతో బెర్త్ ఖాయమైందంటున్నారు.

టీడీపీ శ్రేణులు డీలా

ఉమ్మడి తూర్పులో లభించిన మూడు మంత్రి పదవుల్లో టీడీపీకి ఒకే ఒకటి దక్కడం, జనసేనకు రెండు పదవులు లభించడం టీడీపీలో సీనియర్ ఎమ్మెల్యేలకు తీవ్ర నిరాశ, నిస్పృహను మిగిల్చింది. టీడీపీలో అర డజనుకు పైనే ఉన్న సీనియర్‌లకు కేబినెట్‌లో మొండిచేయి చూపడంతో వారి అనుచర గణం డీలా పడింది. చంద్రబాబు నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకూ కబురు రాకపోవడంతో పోనీ బుధవారం ఉదయమైనా వస్తుందని సీనియర్‌లు నిరీక్షించారు. అయినా ఎటువంటి శుభవార్త లేకపోవడం, మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవం పూర్తికావడంతో సీనియర్ ఎమ్మెల్యేలంతా దిగాలు పడ్డారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న సీనియర్లను పూర్తిగా పక్కన పెట్టేయడం పార్టీ శ్రేణులకు రుచించడం లేదు.

రాజమహేంద్రవరం రూరల్ నుంచి ఎన్నికైన గోరంట్ల బుచ్చయ్యచౌదరి పార్టీలో సూపర్ సీనియర్. ఎన్టీఆర్ ప్రభుత్వంలో కిలో రెండు రూపాయల బియ్యం శాఖ మంత్రిగా పనిచేశారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గోరంట్ల రూరల్ నుంచి వరుసగా మూడుసార్లు గెలుపొందారు. చంద్రబాబు కేబినెట్‌లో ఒక్కసారి కూడా స్థానం దక్కక పోవడంతో కనీసం ఈ సారైనా ఖాయమవుతుందనుకున్న గోరంట్లకు చివరకు భంగపాటు తప్ప లేదు. తుని నుంచి కుమార్తె దివ్యను గెలిపించుకున్న మరో సీనియర్ యనమల రామకృష్ణుడికి నిరాశ తప్ప లేదు. ఉమ్మడి తూర్పులో మిగిలిన సీనియర్‌లందరికీ ఒక దారి రామకృష్ణుడిది మరో దారి అన్నట్టుగా ఉండేది. అటువంటిది యనమల లేని తొలి కేబినెట్ ఇదే కానుంది. టీడీపీలో చంద్రబాబు తరువాత నంబర్-2గా పిలుచుకునే యనమలకు పార్టీలో ప్రాబల్యం తగ్గిందనేందుకు మంత్రివర్గంలో స్థానం లభించకపోవడమే సంకేతమని పార్టీ నేతల మధ్య చర్చ జరుగుతోంది. జగ్గంపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన జ్యోతుల నెహ్రూ పార్టీలో సీనియర్ నేత. మెట్ట ప్రాంతంలో మొదటి నుంచి పట్టున్న నాయకుడు. మంత్రి పదవి ఆయన చిరకాల వాంఛ. అటువంటి నెహ్రూకు కూడా మంత్రివర్గంలో స్థానం లభించక పోవడంతో అతని అనుచరులు తీవ్ర నిరాశకు గురయ్యారు. డిప్యూటీ స్పీకర్ లేదా, మలివిడత విస్తరణలో అవకాశం లభిస్తుందని ఆ వర్గం ఆశిస్తోంది. మరో సీనియర్ నాయకుడు, పెద్దాపురం నుంచి వరుసగా మూడోసారి ఎన్నికైన నిమ్మకాయల చినరాజప్ప. చంద్రబాబు గత కేబినెట్‌లో ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రిగా పనిచేసిన చినరాజప్ప ఈ సారి సీనియర్ కోటాలో బెర్త్ ఖాయమనుకున్నా చివరకు భంగపాటు తప్ప లేదు. కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారు సత్యానందరావు మరో సీనియర్ నేత. సీనియార్టీ, కాపు సామాజికవర్గ ప్రాతిపదికన ఈసారి కచ్చితంగా బెర్త్ ఖాయమనుకున్నా నిరాశే ఎదురైంది. మండపేట, ముమ్మిడివరంల నుంచి ఎన్నికైన వేగుళ్ల జోగేశ్వరరావు, దాట్ల బుచ్చిరాజు సైతం అమాత్య పదవిని ఆశించారు. సామాజిక సమీకరణల్లో వీరికి అవకాశం దక్క లేదంటున్నారు. ఎస్సీ సామాజికవర్గ కోటాలో మంత్రి పదవి ఆశించిన అమలాపురం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు కూడా భంగపాటు తప్ప లేదు. అమలాపురం, పి.గన్నవరం, రాజోలు, గోపాలపురం, కొవ్వూరులలో టీడీపీ, జనసేనల నుంచి ఎస్సీ సామాజికవర్గ ఎమ్మెల్యేలు ఐదుగురు ఎన్నికైనా మంత్రివర్గంలో ఒక్కరికీ ప్రాతినిధ్యం లేకుండా పోయింది.

ఎంపీటీసీ సభ్యురాలి ఇంటిపై దాడి

తాళ్లరేవు: గోవలంక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి ఇంటిపై బుధవారం రాత్రి దాడి జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆ గ్రామంలోని టీడీపీకి చెందిన కొందరు మూడు రోజులుగా డీజేలు పెట్టి డ్యాన్స్‌లు చేస్తున్నారు. కొంతమంది యువకులు మద్యం తాగి తమ ఇంటిపై దాడి చేసి, ఇంటి ఆవరణలోని కుళాయిని విరగ్గొట్టడంతో పాటు మొక్కలు, వస్తువులను చెల్లాచెదురుగా పడేశారని భీమాబాయి తెలిపారు. తాను వృత్తి రీత్యా ఇంటికి దూరంగా ఉంటున్నానని, ఈ ఘటనతో ఇంట్లో ఉన్న తమ పిల్లలు భయభ్రాంతులకు గురయ్యారని ఎంపీటీసీ భర్త, న్యాయవాది శ్రీనివాస్ వాపోయారు. దీనిపై కోరంగి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన తన ఇంటిపై కూడా దాడి చేసి, వస్తువులను ధ్వంసం చేసినట్లు బాధితుడు వైఎస్సార్ సీపీ నాయకుడు కూరాటి వాసు తెలిపారు.

జిల్లాలో నిరంతర పోలీస్ నిఘా

అమలాపురం టౌన్: జిల్లాలో ఎన్నికల అనంతరం ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, కొన్నాళ్ల పాటు నిరంతర పోలీస్ నిఘా ఉంటుందని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర బలగాలతో పాటు జిల్లా పోలీసులు 24 గంటలూ గస్తీ కాస్తారని అన్నారు. జిల్లా పోలీస్ శాఖ గుర్తించిన సమస్యాత్మక గ్రామాల్లో ఈ నిఘా, గస్తీ ఉంటుందన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం బుధవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని ఎస్పీ తెలిపారు. ఎవరూ కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు.

రేపు జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కూల్ టెక్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో ఫార్మసీ, శ్రీనివాస మెడీసిస్టమ్స్ సంస్థలు దాదాపు 800 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇతర వివరాలకు 0884-2373270 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

మంత్రి వర్గంలో క్షత్రియులకు చోటేదీ..?

క్షత్రియ సేవా సమితి కో ఆర్డినేటర్ ఇందుకూరి

అమలాపురం టౌన్: కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కూటమి అధినేతలు మంత్రి వర్గం కూర్పులో క్షత్రియులకు చోటు కల్పించలేదని కోనసీమ క్షత్రియ సేవా సమితి కో ఆర్డినేటర్ ఇందుకూరి నరసింహరాజు అన్నారు. బుధవారం ఆయన అమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. కులాల సమతుల్యతతో మంత్రి వర్గాన్ని కూర్చామని చెబుతున్న కూటమి అగ్రనేతలు క్షత్రియులను ఎలా విస్మరించారని ప్రశ్నించారు. జిల్లాలోని ముమ్మిడివరం, పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజక వర్గాల్లో టీడీపీ నుంచి క్షత్రియులు ఎమ్మెల్యేలుగా గెలిచారని గుర్తు చేశారు. వీరిద్దరూ సీనియర్ నేతలేనని, చట్టసభలకు వెళ్లి వచ్చిన వారేనని నరసింహరాజు అన్నారు. తర్వాత జరిగే మంత్రి వర్గ విస్తరణలోనైనా క్షత్రియులకు చోటు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బడి ఒడికి పదపద..

- నేడు పాఠశాలల పునః ప్రారంభం
- విద్యా కానుక పేరు స్టూడెంట్ కిట్లుగా మార్పు
- తొలిరోజునే అందజేతకు ఏర్పాట్లు
- జిల్లాలో 1,581 ప్రభుత్వ, 451 ప్రైవేట్ స్కూళ్లు



పాఠశాల విద్యార్థులు

రాయవరం: బుడిబుడి నడకలతో పిల్లలు బడి బాట పట్టే రోజు రానే వచ్చింది.. వేసవి సెలవులు ముగియడంతో వారికి చదువుల కోవెల ఆహ్వానం పలుకుతోంది.. పాఠశాలలు తెరిచిన రోజే అంటే గురువారం విద్యార్థులకు 8 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లను పేరు మార్పుతో స్టూడెంట్ కిట్లుగా పంపిణీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. 2024–25 విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించేందుకు సమాయత్తమైంది. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కావాల్సి ఉండగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఈ నెల 13వ తేదీకి మార్చారు.

స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్‌తో..

గతేడాది మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా ప్రభుత్వం స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్‌ను అమలు చేసింది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పాఠశాలలు ప్రారంభం రోజు నుంచే తరగతులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముందే రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలను శుభ్రం చేయడం, తాగునీరు, మధ్యాహ్న భోజనానికి అవసరమైన విధంగా కిచెన్ షెడ్‌లు రెడీ చేయడం, చిన్నపాటి మరమ్మతులు చేయించడం, రికార్డు షీట్‌లు తయారు చేయడం, అడ్మిషన్లు చేపట్టడం తదితర పనులను స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్‌లో చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

స్టూడెంట్ కిట్లు సిద్ధం

పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, యూనిఫామ్, షూ, సాక్స్‌లు, పాఠ్య, రాత పుస్తకాలు, బెల్టు, డిక్షనరీలను స్టూడెంట్ కిట్‌గా అందించనున్నారు. ఈ కిట్‌లో సామగ్రిని విద్యార్థులకు అందజేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాలకు మండల స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ మండల స్టాక్ పాయింట్‌కు చేరుకున్న స్టూడెంట్ కిట్‌లో వస్తువులను పాఠశాలలకు తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన 1,581 పాఠశాలల్లో చదువుతున్న 1.11 లక్షల మంది విద్యార్థులకు వీటిని అందించనున్నారు. ఇప్పటి వరకూ స్టూడెంట్ కిట్‌లో భాగంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, కొన్ని మండలాలకు షూస్ చేరుకున్నాయి. ఇంకా యూనిఫామ్, స్కూల్ బ్యాగ్స్, డిక్షనరీలు, కొన్ని మండలాలకు షూస్, సాక్సులు రావాల్సి ఉంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లాలో ప్రభుత్వ, మండల/జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో 1,272 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 228 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల పరిధిలో 1.11 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అలాగే 451 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల పరిధిలో 80 వేల మంది ఉన్నారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 8,110 మంది ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు.

'నాడు- నేడు'తో సౌకర్యాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మనబడి నాడు-నేడు పథకం కింద తొలి విడతలో 1,345 పాఠశాలలను ఆధునీకరించారు. పాఠశాలల్లో నిరంతర నీటి సరఫరాతో కూడిన టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, తాగునీటి సరఫరా, విద్యార్థులను ఆకట్టుకునేలా పాఠశాలల ప్రహరీలపై పెయింటింగ్స్, భవనాల మరమ్మతులు, గ్రీన్ చాక్‌బోర్డులు ఏర్పాటు చేశారు.

అలాగే పాఠశాలల ప్రహరీలు నిర్మించారు. నాడు- నేడు రెండో దశ పనుల్లో భాగంగా 772 పాఠశాలలను రూ.257 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల సిమెంట్, ఇసుక కొరతతో పనులు నిలిచి పోయినట్లు సమాచారం.

పండగ వాతావరణంలో..



ఈ నెల 13 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయి. ఉపాధ్యాయులు పండగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా పాఠశాలలను సిద్ధం చేయాలి. పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థికి తొలి రోజునే స్టూడెంట్ కిట్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పేరెంట్స్ కమిటీలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలి.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ప్రారంభానికి ఏర్పాట్లు చేశాం



వేసవి సెలవుల తర్వాత పాఠశాలల పునః ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. మొదటి రోజు నుంచే మధ్యాహ్న భోజనం అందించనున్నాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టి కృషితో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

–ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

సమన్వయంతో సాగాలి



పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలి. మండల విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులను సమన్వయం చేసుకుని, పాఠశాలల పునః ప్రారంభంలో ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలి. తొలిరోజు నుంచే హాజరు శాతం పెరిగేలా చూడాలి.

–ఎ.మధుసూదనరావు, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

క్లుప్తంగా

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్: భారత ప్రభుత్వం అందించే పద్మ అవార్డ్స్‌- 2025కు వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సెట్రాజ్‌ సీఈఓ ఏవీఎస్‌ఎన్‌ మూర్తి తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యరంగం, సామాజిక సేవ, సైన్స్‌, ఇంజినీరింగ్‌, ప్రజా వ్యవహారాలు, పౌర సేవలు, వృత్తి, పరిశ్రమ వంటి రంగాల్లో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వ్యక్తులు ఆన్‌లైన్‌ ద్వారా https://awards.gov.in వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత పత్రాలను రెండు సెట్లుగా జూలై 20 లోపు కాకినాడలోని యువజన సర్వీసు శాఖ, సెట్రాజ్‌ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్లు 98499 13065, 89191 35344లలో సంప్రదించాలని కోరారు.

మోటార్‌ సైకిల్‌ నుంచి మంటలు



అమలాపురంలోని 216 జాతీయ రహదారిపై కాలిపోతున్న మోటార్‌ సైకిల్‌

అమలాపురం టౌన్‌: పాత సుజుకి మోటార్‌ సైకిల్‌పై ఇద్దరి యువకులు వెళ్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద 216 జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. రూరల్‌ మండలం సమనస గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఆ మోటార్‌ సైకిల్‌పై వెళుతుండగా ఒక్కసారిగా మంటలు వచ్చాయి. మోటారు సైకిల్‌ బాగా పాత మోడల్‌ కావడంతో మంటలు చెలరేగి దగ్ధమైనట్లు తెలిసింది. ఆ యువకులకు ప్రమాదం తప్పింది. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందలేదు.

రెండు బైక్‌లు, కారు సీజ్‌

కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవ వేళ అమలాపురంలో విజయోత్సవం పేరుతో కొందరు యువకులు బైక్‌ల సైలెన్సర్లు పీకేసి రణగొణ ధ్వనులతో ప్రజలను ఇబ్బంది పెట్టారన్న కారణంతో వారిని పట్టణ పోలీసులు బుధవారం నిలువరించారు. అయితే మరీ శ్రుతిమించి ప్రజలకు అసౌకర్యంగా మారిన రెండు బైక్‌లను, నంబరు ప్లేట్‌ లేకుండా చక్కర్లు కొడుతున్న ఓ కారును సీజ్‌ చేసినట్లు పట్టణ ఎస్సై కిశోర్‌బాబు తెలిపారు.

మిత ఆహారమే హితం

- అతిగా తింటే అనారోగ్యమే
- ఆహార అలవాట్లలో పరిమితులు అవసరం
- వ్యాయామంతో రోగాలకు చెక్‌



అమలాపురం టౌన్‌: కాలం మారింది.. జీవన విధానమూ ఛేంజ్‌ అయ్యింది.. ఆధునిక పోకడల పేరుతో జంక్‌, ఫాస్ట్‌ ఫుడ్‌లకు యువత అలవాటు పడింది. మార్కెట్లో దొరికే ఫాస్ట్‌ ఫుడ్‌ కోసం పరుగులు తీయడం, ఆనక రోగాల బారిన పడడం పరిపాటైంది. హోటళ్లు, రెస్టారెంట్లకు వెళితే బిర్యానీలు, రకరకాల నాన్‌వెజ్‌ వేపుళ్లు అతిగా ఆరగించడం ఎక్కువైంది. ఇదే ఆరోగ్యాన్ని హరిస్తోంది.. ఉద్యోగాలు చేసే యువతలో అయితే వీకెండ్‌ వస్తే చాలు ఈ విపరీత ఆహార ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ఏదైనా సుస్తి చేసి ఆస్పత్రికి వెళితే వైద్యులు చెప్పే మాటలు నాలుగే నాలుగు. 'ఏది తిన్నా పరిమితంగా తినండి, అధికంగా వద్దు. బరువును కాస్త తగ్గించుకోండి, వ్యాయామం చేయండి' అంటూ పదే పదే చెబుతుండడం వినిపిస్తోంది. తర్వాత వైద్యుల సలహాను అంతా పెడచెవిన పెట్టడం కనిపిస్తోంది. ఇదే అనర్థాలకు దారిస్తోంది.

రోజుకు రూ.కోటి పైమాటే

జిల్లాలో ఫాస్ట్‌ ఫుడ్‌తోపాటు రోడ్ల చెంత తోపుడు బండ్లపై బజ్జీలు, పానీ పూరి వంటి విక్రయాలతో రోజుకు రూ.1.20 కోట్ల వ్యాపారం జరుగుతోందని అంచనా. ఇటీవల కాలంలో జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం ఫాస్ట్‌ ఫుడ్‌ కల్చర్‌ బాగా పెరిగింది. సాయంత్రమైతే చాలు ముఖ్యంగా పిల్లలు, యువత వీటిపైనే ఆసక్తి చూపుతున్నారు. ఆన్‌ ఆర్డర్లతో కూడా మాంసాహారంతో కూడిన బిర్యానీ, ఫాస్ట్‌ ఫుడ్‌ను ఇళ్లకు పార్శిళ్ల రూపంలో రప్పించుకుని ఆరగించేస్తున్నారు. జిల్లాలో 170కి పైగా ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్లు, 600కి పైగా బజ్జీలు, పానీ పూరీ తోపుడు బండ్లు ఉన్నాయి. ఈ తరహా ఆహారం మోజులో పడి కొందరు మితం మరిచిపోయి అపరమిత ఆహారం తీసుకుంటున్నారు.

ఫాస్ట్‌ ఫుడ్‌ జోలికి వెళ్లొద్దు

ఎవరైనా సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవాలి. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుంది. అధిక క్యాలరీలు ఉన్న ఆహారంతో ఊబకాయం, షుగర్‌, గుండె సమస్యలు, ఆయాసం వంటివి వస్తాయి. ఫాస్ట్‌ ఫుడ్‌ జోలికి పోకూడదు. ఏదీ అధికంగా తీసుకోకుండా మితం విధిగా పాటించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఆహార ప్రణాళికను తయారు చేసుకుని దానికి అనుగుణంగా భుజించాలి.

–డాక్టర్‌ కె.శంకరరావు, సూపరింటెండెంట్‌, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, అమలాపురం

కొలస్ట్రాల్‌ పెరిగి దుష్పరిణామాలు

మనిషి తీసుకునే ఆహారంలో లభించే క్యాలరీలు, ఖర్చయ్యే క్యాలరీలకు పొంతన ఉండడం లేదు. ఈ ప్రభావంతో కొలస్ట్రాల్‌ పెరుగుతున్నాయి. ఇది దీర్ఘకాలిక వ్యాధుల వైపు నెట్టేస్తున్నాయి. కార్బోహైడ్రేట్స్‌ అధికంగా ఉన్న ఆహారాన్ని భుజిస్తే క్రమేపీ ఊబకాయం వస్తుంది. ఈ ప్రభావంతో షుగర్‌, బీపీ, జీర్ణకోశ, గుండె సంబంధిత వ్యాధుల తోపాటు మానసిక ఒత్తిడి అనివార్యమవుతోంది. ఆహార అలవాట్ల కారణంగానే అధిక శాతం మంది షుగర్‌ వ్యాధి బారిన పడుతున్నారు. మనం తీసుకునే ఆహారంలో క్యాలరీలు రోజూ ఒకేలా ఉండేలా సమతుల్యాన్ని పాటించాలి.

నూనె వాడకం తగ్గించాలి

బయట మార్కెట్లో లభించే ఇన్‌స్టెంట్‌ ఆహారంతో పాటు ఇంట్లో కూడా వంట నూనె అధికంగా వాడడం, పాలిష్‌డ్‌ రైస్‌ (బియ్యం) వినియోగం బాగా తగ్గించాలి. అధిక నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలు, పాలిష్‌డ్‌ రైస్‌తో వండిన అన్నం తిన్నప్పుడు మంచి రుచికరంగా ఉన్నప్పటికీ క్రమేపీ అవి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. దుంప కూరలు, మైదా, సేమియా, రవ్వ వంటి వాటిలో కార్బోహైట్రేట్స్‌తో పాటు షుగర్‌ లెవల్స్‌ను పెంచే గుణం కూడా అధికంగా ఉంటుంది.

ఏ ఆహారం తీసుకోవాలంటే..

రోజూ తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్‌ తక్కువగా, ప్రొటీన్స్‌, మినరల్స్‌, ఫైబర్‌ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. కోడిగుడ్డు, కంది పప్పు, పెసర పప్పు తదితర పప్పులు, కూరగాయలు, ఆకు కూరలు ఆహారంగా భుజించాలి. వంట నూనెలు మార్చి మార్చి వాడాలి. జామ, యాపిల్‌, కివీ, స్ట్రాబెరీ, బొప్పాయి, కర్జూరంతోపాటు డ్రై ఫ్రూట్స్‌, పలు రకాలు పండ్లు తీసుకోవాలి. పండ్ల రసాలు కూడా తాగాలి. రోజూ ఒక జామకాయ తినాలి. జామలో విటమిన్‌–సి, ఫైబర్‌ ఉంటుంది. ఏది తిన్నా మితంగా తినాలి. అధిక పిండి పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం తగ్గించాలి. రోజూ వ్యాయామం చేయాలి. బరువు, వయసు ఆధారంగా తగిన మంచినీళ్లు తీసుకోవాలి. ఉదాహరణకు మనం రోజూ ఓ పూటలో బియ్యం (అన్నం) 50 నుంచి 70 గ్రాములు తీసుకోవాల్సి ఉంటే 150 నుంచి 200 గ్రాములు తీసుకుంటున్నాం. వంట నూనె నెలకు 500 గ్రాములు వాడాల్సి ఉంటే, 1,250 గ్రాములు వాడుతున్నాం. ఇలా మనం భుజించే ఆహార పదార్థాలు తీసుకునేందుకు నిర్దిష్టమైన పరిమితులు ఉన్నప్పటికీ చాలామంది పాటించడం లేదని ఆహార అధ్యయన సంస్థల లెక్కలు చెబుతున్నాయి.

ఎక్కడి వాహనాలు అక్కడే..



నల్లజర్ల- తాడేపల్లిగూడెం రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

నల్లజర్ల: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడి ప్రమాణ స్వీకారోత్సవానికి ఒక రోజు ముందుగానే ప్రైవేట్‌ వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేయడంతో వాహనదారులతో పాటు ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నల్లజర్ల- తాడేపల్లిగూడెం మార్గంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు పక్కకు తప్పుకొనే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ ఆ రహదారి ట్రాఫిక్‌ దిగ్బంధంలో చిక్కుకుంది. వ్యాపారులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌ వెళ్లే వాహనాలను దేవరపల్లి, ఖమ్మం మీదుగా మళ్లించారు. నెల్లూరు, చెన్నై వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలను కూడా నల్లజర్ల- తాడేపల్లిగూడెం- ఒంగోలు మీదుగా మళ్లించారు. ఈ మార్గంలో వెళ్లే భారీ వాహనాలతో నల్లజర్ల- తాడేపల్లిగూడెం రహదారి నిలిచిపోయింది. నల్లజర్ల జంక్షన్‌ నుంచి రెండు కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోవడంతో అటుగా రాకపోకలు సాగించే వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

రాజు కుటుంబానికి అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ కొవ్వూరు ఇన్‌చార్జ్‌ తలారి వెంకట్రావు
- బ్రాహ్మణగూడెంలో పరామర్శ



బ్రాహ్మణగూడెంలో తాళ్లూరి రాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు

చాగల్లు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ ఓటమిని తట్టుకోలేక కొవ్వూరు గోదావరి గామన్‌ బ్రిడ్జి వద్ద కుటుంబ సమేతంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చాగల్లు మండలం బ్రాహ్మణగూడేనికి చెందిన ఆ పార్టీ కార్యకర్త తాళ్లూరి రాజు కుటుంబాన్ని వారి నివాసంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రాజు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎలాంటి అఘాత్యాలకు పాల్పడవద్దని రాజుకు, అతడి భార్య నాగలక్ష్మికి సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపొందేది వైఎస్సార్‌ సీపీయే అని, వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ఎటువంటి ఆందోళన చెందొద్దని భార్య, పిల్లలతో సంతోషంగా ఉండాలని హితవు పలికారు. ఈ సందర్భంగా తాళ్లూరి రాజు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి, సంక్షేమ ప్రదాత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమ కుటుంబానికి ఎంతో మేలు జరిగిందన్నారు పేదలకు మంచి చేసే వైఎస్సార్‌ సీపీ ఓడిపోవడం తనను ఎంతో బాధించిందని వాపోయాడు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ శ్రీనివాస్‌, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్‌ ప్రత్తిపాటి సుబ్బారావు, మాజీ డైరెక్టర్లు ఉండవల్లి శ్రీనివాస్‌, పొన్నాడ సింహాద్రి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కేతనపల్లి శ్రీనివాస్‌, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంత కందకూ...

- చరిత్ర సృష్టించిన ధర
- ఐదేళ్ల తర్వాత లాభాల్లో రైతులు



అన్నవరప్పాడులో కందను తవ్వుతున్న కూలీలు



అన్నవరప్పాడులో కంద దుంపలను వ్యాన్‌లో లోడు చేస్తున్న కూలీలు

పెరవలి: అంత'కంద'కూ ధర పెరిగింది.. రికార్డు సృష్టించింది.. కంద పంట కాసులు కురిపిస్తోంది. జిల్లాలో కంద రైతులు కొన్నేళ్లుగా నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. ప్రస్తుతం మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడంతో రైతుల మోములో ఆనందం ఉట్టిపడుతోంది.. ప్రస్తుతం మార్కెట్‌లో కంద పుట్టు (232 కిలోలు) ధర రూ.11 వేలు పలుకుతోంది. గతంలో ఇంత ధర ఎప్పుడూ లేదు. ముందు ఏడాది కంటే ఈ ఏడాది ఊరికలు తగ్గినా, ప్రస్తుతం ఎకరానికి 50 నుంచి 60 పుట్టులు ఊరికలు జరగటంతో రైతులు లాభాల బాట పడుతున్నారు. దీనివల్ల ఎకరానికి రూ.1.80 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకూ మిగులుతోంది.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లాలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, పోలవరం, కడియం మండలాల్లో సుమారు 1,250 హెక్టార్లలో కంద సాగు జరుగుతోంది. గతంలో ఈ పంట నష్టాలు తీసుకురావటంతో రైతులు పంట విస్తీర్ణం తగ్గించారు. ప్రస్తుతం రైతులు లాభాలు బాట పట్టారు. కంద పుట్టు ధర ఊహించని విధంగా ఈ ఏడాది రూ.10 వేల నుంచి ప్రారంభమై ప్రస్తుతం రూ.11 వేల వద్ద స్థిరంగా ఉంది. గత ఏడాది ఇదే సమయంలో పుట్టు ధర రూ.6,600 ఉండగా, నేడు రూ.11 వేల పలుకుతుంది.

పెట్టుబడి ఎంతంటే..

కంద సాగు చేసే రైతులు లక్షల్లో పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఎకరం కంద వేయాలంటే విత్తనానికి (30 పుట్టులు) రూ.2 లక్షలు, దుక్కు, కంద నాటడానికి, బోదెలు తవ్వడానికి, చప్పు ఎక్క వేయడానికి కూలీలకు రూ.లక్ష అవుతుంది. పెంట వేయడానికి రూ.30 వేలు, ఎరువులు, పురుగు మందులకు రూ.35 వేలు, నీటి తడులు, కలుపుతీతకు రూ.25 వేలు. ఇలా మొత్తం ఖర్చు రూ.3.90 లక్షలు అవుతుండగా.. నేడు ఊరికలు ఆధారంగా ప్రస్తుత మార్కెట్‌ ప్రకారం రైతులకు ఎకరానికి రూ.1.80 లక్షల నుంచి రూ.2.80 లక్షలు లాభాలు వస్తున్నాయని అంటున్నారు.

లాభాల బాటలో పంట



ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించటంతో నేడు లాభాల బాట పడుతున్నాం. ఎకరానికి పెట్టుబడి పోను రూ. లక్షపైనే మిగులు వచ్చింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడం, మార్కెట్‌లో ధర బాగుండడంతో లాభాల బాట పట్టాం.

–వేంద్ర ఏసు, కంద రైతు, ముక్కామల

ఆశాజనకంగా సాగు



ఊహించని విధంగా కంద పంట ఆశాజనకంగా ఉంది. గతంలో ధర ఉంటే ఊరికలు లేవు. ఊరికలు ఉంటే ధర ఉండేది కాదు. నేడు ధర, దిగుబడి బాగుంది. దీంతో ఎకరానికి రూ.1.60 లక్షల పైనే మిగులుతోంది.

–బొలిశెట్టి వెంకటేశ్వరరావు, కంద రైతు, అన్నవరప్పాడు

మంచి డిమాండ్‌ ఉంది



ఉభయ గోదావరి జిల్లాల్లో పండించిన కంద పంటకు మద్రాస్‌, ముంబయి మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉంది. దీంతో ధరలు బాగున్నాయి. అంతే కాకుండా అన్ని జిల్లాల్లో కంద ఊరికలు గతంలో కంటే బాగా తక్కువగా రావడంతో మార్కెట్‌లో ధర పెరిగాయి. రైతులకు లాభం చేకూరుతుంది.

–గడుగోయ్యిల సత్యనారాయణ, కంద వ్యాపారి

ఏపీఈఏపీ సెట్‌లో 'ఆదిత్య' ప్రతిభ



కల్కి సువర్ణ్‌, అతని తండ్రి నరసింహారావును అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌ చలపతిరావు

అమలాపురం టౌన్‌: ఏపీఈఏపీ సెట్‌ ఫలితాల్లో అమలాపురం ఆదిత్య జూనియర్‌ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆదిత్య విద్యా సంస్థల అకడమిక్‌ డైరెక్టర్‌, ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ పీఎస్‌వీఎస్‌ చలపతిరావు తెలిపారు. కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి భోజనపల్లి కల్కి సువర్ణ్‌ 100వ ర్యాంక్‌ సాధించి జిల్లాలోనే ఉత్తమ ర్యాంకర్‌గా నిలిచాడన్నారు. ఇదే విద్యార్థి ఇటీవల దేశ వ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌ పరీక్షలో 626 ర్యాంక్‌ కైవసం చేసుకున్నాడన్నారు. అలాగే ఎం.లక్ష్మీనాగ అనన్య 1,388వ ర్యాంక్‌, ఎస్‌.అశ్రిత 2,970, ఎస్‌.పూర్ణిమ 3,059, కె.సత్య గణేష్‌ 3,376, ఆర్‌.బాల ప్రసన్న 3,994, సీహెచ్‌ మహేష్‌ 4,030, కేఆర్‌ఎస్‌ తేజ 4,639, వైఎంపీ శ్రీలక్ష్మి 4,756 ర్యాంక్‌లను సాధించారన్నారు. వీరిని బుధవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్‌ చలపతిరావు, అధ్యాపకులు ప్రశంసించారు. ముఖ్యంగా కల్కి సువర్ణ్‌ను, అతని తండ్రి నరసింహారావులకు పుష్పగుచ్ఛం అందించారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి నల్లమిల్లి కృష్ణ దీపక్‌ రెడ్డి అభినందించారు.



పట్టిన చేపలను తీసుకువస్తున్న మత్స్యకారులు



ఎగుమతికి సిద్ధంగా ఉన్న మత్స్య సంపద



చేపల విక్రయాలతో కళకళలాడుతున్న రేవు

చేప చిక్కింది..

- ఒక్కరోజే రూ. కోటికి పైగా వ్యాపారం
- అమీనాబాద్‌ రేవులో సందడి

కొత్తపల్లి: వేట నిషేధంతో రెండు నెలలుగా బోసిపోయిన అమీనాబాద్‌ రేవులో ప్రస్తుతం చేపల సందడి మొదలైంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి వేట నిషేధం పూర్తి కానుండడంతో ముందుగానే మత్స్యకారులు వేటకు వెళ్లడం ప్రారంభించారు. దీంతో బుధవారం భారీగా మత్స్య సంపద వలలకు చిక్కింది. ఎన్నడూ లేని విధంగా టన్నుల కొద్దీ చేపలతో బోట్లు నిండిపోయాయి. ఉప్పాడ, అమీనాబాద్‌, మూలపేట గ్రామాలకు చెందిన సుమారు 100 బోట్లపై మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లారు. ఒక్కో బోటుకు భారీగా మత్స్య సంపద లభించడంతో ఉప్పాడ, అమీనాబాద్‌ తీర ప్రాంతం చేపల విక్రయాలతో కళకళలాడింది. ఒక్కో బోటుకు 1-2 టన్నుల వరకూ మత్స్య సంపద (కాణా గొరస), టైగర్‌ రొయ్యలు చిక్కాయి. సుమారు రూ.కోటి విలువ చేసే వంద టన్నుల మత్స్య సంపద లభించిందని వారు చెబుతున్నారు. వీటిని లారీల్లో కేరళ, తమిళనాడు కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలకు తరలించారు. చేపల క్రయవిక్రయాలతో తీర ప్రాంతం కిక్కిరిసింది.

భారీగా వ్యాపారం

ఇక్కడ ఒక్కరోజులో సుమారు రూ. ఒక కోటికి పైగా వ్యాపారం జరగడం విశేషం. ఈ మధ్యకాలంలో ఇదే మొదటిసారి. భారీ చేపలు కాకుండా చిన్న చేపలు (కాణా గొరిసెలు) అధికంగా మత్స్యకారుల వలలకు చిక్కాయి. తీరానికి అతి చేరువలోనే ఈ మత్స్య సంపద లభించిందని వారు చెబుతున్నారు.